చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత

నందిగామ, మార్చి 20 : మండలంలోని పత్లవత్ మోహన్, మహమ్మద్ అమీర్, చరణ్‌తేజ, ఫరూఖ్‌నగర్‌కు చెందిన పద్మమ్మ, సుధాకర్‌గౌడ్, మరికల్ మండలానికి చెందిన శివకుమార్, కొల్లాపూర్‌కు చెందిన మశమ్మ, భీమ్‌సాగర్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి అందజేశారు. ఆయన వెంట షాద్‌నగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్లు నర్సింహ, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రవణ్‌కుమార్, కుమార్, సుదర్శన్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కుమార్‌గౌడ్ ఉన్నారు.

వందశాతం పన్ను వసూలు చేయాలి

సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్యగౌడ్

చేవెళ్ల రూరల్, మార్చి 20 : గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలు వందశాతం పూర్తి చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ సూచించారు. గురువారం శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను త్వరగా పూర్తి చేసి, అర్హుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. హరితహారం నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

చేవెళ్లటౌన్, మార్చి 20 : చేవెళ్లలోని 75 సర్వేనంబర్‌లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 సర్వేనంబర్‌లో రెండు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు సుధీర్, శ్రీనివాస్, జంగయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మగ్బుల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, గీత పని వారల సంఘం మండల కార్యదర్శి కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో తైబజార్ వేలం

ఆమనగల్లు, మార్చి 20: ఆమనగల్లు మున్సిపాలిటీ తైబజార్ వేలంలో రికార్డు స్థాయిలో రేటు పలికింది. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం కమిషనర్ శంకర్‌నాయక్ సమక్షంలో వేలం నిర్వహించారు. ఇందులో 31 మంది పోటీపడగా రూ. 34 లక్షలకు జెనిగల గిరియాదవ్ తైబజార్ టెండర్ దక్కించుకున్నారు. అదే విధంగా చికెన్ వ్యర్థాల సేకరణకు కోసం రూ. 4.91లక్షలకు మానుపాటి నర్సింహ దక్కించుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆమనగల్లు, మార్చి 20: ఆమనగల్లు మున్సిపాలిటీలోని సురసముద్రం చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటాయని, అతడి ఒంటిపై కాఫీ కలర్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ఉంటుందని ఎస్ఐ తెలిపారు. మిగతా వివరాల కోసం 8712663339 లేదా ఎస్ఐ నంబర్ 8712663340 లేదా సీఐ నంబర్ 9440795749కు సంప్రదించాలని ఆయన కోరారు.

వృద్ధురాలి అదృశ్యం



బచ్చమ్మ(ఫైల్)

కేశంపేట, మార్చి 20: ఇంటి నుంచి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన ఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం సీఐ నరహరి వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన బ్యాగరి బచ్చమ్మ(65) 10ఏండ్లుగా ఫిట్స్‌తో బాధపడుతూ మతిస్థిమితంలేకుండా ప్రవర్తిస్తుందన్నారు. ఈ నెల 17న ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె సాయంత్రానికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధురాలు ఇంటి నుంచి వెళ్లిన సమయంలో పసుపురంగు చీర, ఎరుపురంగు జాకెట్ ధరించి ఉందన్నారు. బాధిత వృద్ధురాలి కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళల మధ్య ఘర్షణ.. కేసు నమోదు

నందిగామ,మార్చి20: ఇద్దరు మహిళల మధ్య ఇంటి వద్ద ఉన్న మురుగు కాల్వ విషయమై ఘర్షణ జరిగిన ఘటన నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన నందిని, అమల పక్క పక్కన ఇండ్లలో నివాసముంటున్నారు. వీరి ఇంటి ఎదుట ఉన్న మురుగు కాల్వ విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఇరువురు నందిగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందిగామ సీఐ ప్రసాద్ తెలిపారు.

తాగునీటి కోసం బిందెలతో రోడ్డెక్కిన భరత్‌నగర్ కాలనీ మహిళలు

నెలలు గడిచినా.. తాగునీటి కష్టాలే..

- కొత్తూరు నాలుగో వార్డులో తప్పని ఇబ్బందులు
- మూడు నెలలుగా మిషన్ భగీరథ నీరు బంద్
- బిందెలతో రోడ్లపై మహిళల నిరసన
- అధికారులు పట్టించుకోవడంలేదంటున్న కాలనీవాసులు
- హెచ్‌ఆర్‌డీసీఎల్ -మున్సిపల్ శాఖల మధ్య సమన్వయ లోపం

కొత్తూరు, మార్చి 20: మూడు నెలలుగా ఆ వార్డు ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఎండలు ముదరడంతో నీరులేక తామెట్ల జీవించాలో అర్థంకాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాఖల మధ్య సమన్వయలోపంతో కాలనీ ప్రజలు ఎండాకాలంలో నీటికోసం అరిగోస పడుతున్నారు. తాగు నీరు కావాలంటూ మూడు నెలలుగా అధికారులకు మొరపెట్టుకున్నా వినడంలేదని వాపోతున్నారు. కేవలం మిషన్‌భగీరథ నీటిమీదనే ఆధారపడిన భరత్‌నగర్ కాలనీ ప్రజలు బాధలు వర్ణనాతీతం. మహిళలు తాగునీటి కోసం బిందెలు పట్టుకొని రోడ్లపైకి వచ్చినా అధికారులు కదలరా అని కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులు

కొత్తూరు మున్సిపాలిటీలోని 4వ వార్డు భరత్‌నగర్ కాలనీలో మూడు నెలలుగా మిషన్ భగీరథ నీరురావడంలేదు. కొత్తూరు పూలే చౌరస్తా నుంచి జేపీ దర్గా రోడ్డు వరకు రోడ్డు విస్తరించే పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా హెచ్‌ఆర్‌డీసీఎల్(హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) రోడ్డు నిర్మాణ పనుల కోసం చేపట్టి తవ్వకాల్లో భరత్‌నగర్ కాలనీకి వెళ్లే నీటిపైపు పగిలిపోయింది. దీంతో 4వ వార్డుకు మిషన్ భగీరథ పనులు వాటర్ సరఫరా బంద్ అయింది.

పలుమార్లు కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినం..

3 నెలలుగా భరత్‌నగర్ కాలనీకి నీటి సరఫరా కావడం లేదు. ఈ విషయంపై పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి పైప్‌లైన్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశాను. అయితే అది హెచ్‌ఆర్‌డీసీఎల్ వారు చేయాల్సిపని అని కమిషనర్ తప్పించుకుంటున్నారు. ఈ విషయంపై హెచ్‌ఆర్‌డీసీఎల్ వారిని సంప్రదిస్తే కమిషనర్ స్పందించడం లేదని చెబుతున్నారు. మున్సిపల్, హెచ్‌ఆర్‌డీసీఎల్ మధ్య తమ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సరఫరాను పునరుద్ధరించాలి.

- సోమ్లానాయక్, 4వ వార్డు కౌన్సిలర్, కొత్తూరు మున్సిపాలిటీ

ఆందోళన చేపడుతాం

నీటి సరఫరా అంతరాయంపై కౌన్సిలర్‌తో కలిసి తామంతా మున్సిపాలిటీ వద్దకు వెళ్లి కమిషనర్‌ను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. కాలనీకి నీటి సరఫరా పునరుద్ధరించపోతే మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపడుతాం. గతంలో తమకు డే బై డే తాగునీరు వచ్చేది. వీలైనంత త్వరగా నీటి సరఫరా చేయాలి.

- నిర్మల, భరత్‌నగర్‌కాలనీ, 4వ వార్డు

బిందెల్లో నీటిని తెచ్చుకుంటున్నాం..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి కోసం ఎప్పుడూ ఇబ్బందులు పడలేదు. మిషన్ భగీరథ నీటిని పునరుద్ధరించి నీటి సమస్యను తీర్చాలి. 3 నెలలుగా నీరు రాకున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. నీటికోసం బిందెలు తీసుకొని ఎక్కడ నీరు దొరికితే అక్కడికి వెళ్లి తెచ్చుకుంటున్నాం. నీటిగోసను తీర్చకపోతే ఆందోళన చేపడుతాం.

- నాగరాణి, భరత్‌నగర్ కాలనీ, కొత్తూరు మున్సిపాలిటీ

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్

విమర్శలు మాని నిధులు తేవాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను విమర్శించడం సరికాదు
మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేయాలి
ప్రెస్ కాన్ఫరెన్స్‌లో బీఆర్‌ఎస్ నాయకుల కౌంటర్

కొత్తూరు, మార్చి 20: మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను విమర్శిస్తే అదే అభివృద్ధి అని కాంగ్రెస్ నాయకులు భ్రమపడుతున్నారని బీఆర్‌ఎస్ నాయకులు అభిప్రాయపడ్డారు. అంజయ్యయాదవ్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్ ఆధ్వర్యంలో కొత్తూరు పాప్రస్ పోర్డులో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు అధిక నిధులు తీసుకువచ్చి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేయాలన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు అప్పటి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తెచ్చిన ప్రొసీడింగ్స్‌తోనే అని పునరుద్ఘాటించారు.

డీపీ వరల్డ్‌పై ఇచ్చిన ఫిర్యాదు ఏమైంది

దుబాయ్ వరల్డ్ కంపెనీ అసైన్డ్ భూములను ఆక్రమించిందని కాంగ్రెస్ నాయకులు మూడు నెలల క్రితం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారని మున్సిపల్ కౌన్సిలర్ కొస్గి శ్రీనివాసులు పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ డీపీ వరల్డ్‌పై చర్యలు తీసుకోకపోవడంలో మర్మమేమిటో కాంగ్రెస్ నాయకులు చెప్పాలన్నారు. కుమ్మరిగూడ రోడ్డుపై కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని కౌన్సిలర్ విమర్శించారు. గతంలో కొత్తూరు రైల్వేగేట్ నుంచి అక్కివేనిగూడ వరకు రోడ్డు మంజూరు అయిందన్నారు. అప్పుడు బీటీ రోడ్డు వేయగా మిగిలిన డబ్బులతో కిలో మీటర్ వరకు 18 ఫీట్ల సీసీ రోడ్డు వేశామని చెప్పారు. ఈ తర్వాత హెచ్‌ఆర్‌డీసీఎల్ ఫండ్ నుంచి విశాలమైన రోడ్డు కోసం మాజీ ఎమ్మెల్యే రూ.32 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఆ పనులే ఇప్పుడు కొనసాగుతున్నాయని, 18 ఫీట్ల రోడ్డుకు ఇప్పుడు జరుగుతున్న పనులకు సంబంధం లేదనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలన్నారు. ఇప్పుడు వేస్తున్న 24 ఫీట్ల రోడ్డు కోసం రూ. కోటితో వేసిన సీసీ రోడ్డును తొలగించడం ఎంతవరకు సమంజసమన్నారు. నిధులు తేవడం మాని అప్పటి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరైంది కాదన్నారు.

అభివృద్ధికి కృషి..

తిమ్మాపూర్, స్టేషన్ తిమ్మాపూర్‌ను అభివృద్ధి చేశామని మాజీ ఎంపీటీసీ రాజేంద్రగౌడ్ చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీరోడ్లు ఎన్నో నిర్మించామని పేర్కొన్నారు. అలాగే తిమ్మాపూర్ నుంచి చేగూర్ వరకు రోడ్డు వేశామన్నారు. తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ నిర్మించామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్ సోమ్లానాయక్, యాదయ్య, శ్రీనివాగ్‌గౌడ్, బాల్‌రాజు, కే శ్రీనివాస్, శివకుమార్, రవినాయక్, రాజశేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి స్రవంతి

షాద్‌నగర్‌టౌన్, మార్చి 20: వేసవికాలం దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి స్రవంతి అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల కోసం పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. 30సంవత్సరాలు దాటిన వారందరికీ షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ముస్తకిన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, శ్రీరామ, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మహిళలకు ప్రోత్సాకాలను అందజేస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తదితరులు

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి

యాచారం, మార్చి20: మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మేడిపల్లి గ్రామంలోని రైతు వేదిక భవనంలో అమెజాన్, కన్సల్ట్ ఇండియా సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని గురువారం ఘనంగా జరుపుకొన్నారు. కన్సల్ట్ ఇండియా భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న సంకల్ప్ ప్రాజెక్ట్ అభ్యర్థులను సత్కరించి, ప్రోత్సాహకాలను అందజేశారు. మేడిపల్లి, నానక్‌నగర్ పంచాయతీల పరిధిలోని ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలు, వ్యవస్థాపక అభివృద్ధి శిక్షణలో అభ్యర్థులకు అమెజాన్ సంస్థ ప్రైజ్‌మనీ అందజేసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అమెజాన్ రీజనల్ మేనేజర్ లత, ఏపీఎం సాంబశివుడు, పీఏసీఎస్ డైరెక్టర్ స్వరూప పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఆమనగల్లులోని పాఠశాలను తనిఖీ చేస్తున్న మండల విద్యాధికారి పాండు

ఆమనగల్లు, మార్చి 20: మండలంలోని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని మండల విద్యాధికారి పగిడిపాల పాండు తెలిపారు. మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒంటిపూట బడులు నిర్వహించడం లేదని పలు విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల నుంచి మౌఖిక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో గురువారం మండలంలోని ప్రైవేటు పాఠశాలలను మండల విద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్ని పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఒంటి పూట బడులు ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని ఆయన తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

ఆమనగల్లు, మార్చి 20: మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడాన్ని హర్షిస్తూ పట్టణంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌మాదిగ విచ్చేసి స్థానిక నాయకులతో కలిసి బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు మాదిగ, మైసయ్య మాదిగ, మల్లేశ్‌మాదిగ, భీమయ్య, నాయకులు అల్లాజీ, శ్రీరాములు, అరుణ్, కిరణ్, శ్రీశైలం, జంగయ్య, వెంకటేశ్, గిరి, ఎల్లయ్య, సత్తయ్య ఉన్నారు.

సూర్యాపేట సభకు తరలిన బీఆర్‌ఎస్ నేతలు

షాబాద్, మార్చి 20: ఏప్రిల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ సందర్భంగా గురువారం సూర్యాపేటలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంట షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మండల బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యాదయ్య, మల్లేశ్, దేవేందర్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, హరీశ్, భూపాల్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చేవెళ్ల రూరల్, మార్చి 20 : చేవెళ్ల మండల పరిధి దామరగిద్ద గ్రామంలో గురువారం మలక్‌పేట యశోద దవాఖాన సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ హాజరై ప్రారంభించిన అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. శిబిరంలో దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో హెల్ప్‌డెస్క్

పెద్దఅంబర్‌పేట, మార్చి 20: ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో రాష్ట్రంలోనే పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ముందువరుసలో ఉన్నదని కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. ప్లాట్ల క్రమబద్ధీకరణకు వచ్చే యజమానుల కోసం మున్సిపాలిటీలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. గురువారం నాటికి 32,750 ప్లాట్లకు సంబంధించిన ఫీజు వివరాలను సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) వారు మొబైల్ నంబర్లకు పంపారని చెప్పారు. సుమారు 1,486 ప్లాట్లకు సంబంధించిన రూ.11.23 కోట్ల ఫీజును వసూలు చేశామని వెల్లడించారు. ఇప్పటివరకూ 244 ప్లాట్లకు సంబంధించి ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్‌ను ఆన్‌లైన్ ద్వారా ఫోన్ నంబర్‌కు పంపినట్టు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాబాద్, మార్చి 20: నేడు మండలంలోని నాగరగూడలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్ లైన్లలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

7 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయాలి

చేవెళ్లటౌన్, మార్చి 20: మండల పరిధిలోని గుండాల, రేగడి ఘనపూర్ ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో అత్యధికంగా పంటలు సాగు చేస్తారని చేవెళ్ల గ్రామానికి చెందిన కె.వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం వ్యవసాయ రంగానికి సాయంత్రం 7గంటల వరకు విద్యుత్ సరఫరా చేయాలని చేవెళ్ల విద్యుత్ ఏఈకి వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని గుండాల ఫీడర్ పరిధిలోని సాయంత్రం పూట విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారని వివరించారు.

ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీక

చేవెళ్ల రూరల్, మార్చి 20 : ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయని శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ గోవర్దన్‌రెడ్డి అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్ వార్డులోని ముస్లింలకు మాజీ ఎంపీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, స్థానిక నేతలు శంకర్, గణేశ్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, జంగయ్య, వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఫతేపూర్ వార్డులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

ముగిసిన ఇంటర్ పరీక్షలు



షాద్‌నగర్ పట్టణంలో పరీక్షలు ముగియడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 20: ఇంటర్ పరీక్షలు షాద్‌నగర్ పట్టణంలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. షాద్‌నగర్ పట్టణంలో 6 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. 1715మంది సాధారణ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉన్నప్పటికీ 1644మంది హాజరు కాగా, 71మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదే విధంగా 350మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉన్నప్పటికీ 303మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. కాగా, 47మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కస్టోడియన్ వి. శ్రీకాంత్ తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అదే విధంగా ఒకేషనల్ పరీక్షలు శనివారం ముగుస్తాయని తెలిపారు.

కేశంపేట : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర జనరల్ విభాగం పరీక్షలు గురువారంతో ముగిశాయి. మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కామర్స్–2, కెమిస్ట్రీ–2 పరీక్షలను 160మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 9మంది గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కేశంపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారన్నారు. శుక్రవారం జరిగే ఒకేషనల్ విద్యార్థుల బ్రిడ్జికోర్సుతో ఇంటర్ పరీక్షలు పూర్తిగా ముగుస్తాయన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

కేశంపేట, మార్చి 20: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చుతామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లాదుర్గం సురేశ్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గతంలో ఆయా రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగానే వాడుకున్నాయని, అత్యధిక జనాభాగల ముదిరాజ్‌లకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరముందన్నారు. ముదిరాజ్‌లను బీసీ– డీ నుంచి బీసీ– ఏలోకి మార్చి రిజర్వేషన్ శాతాన్ని పెంచి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ నారాయణ, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయమ్మ, జంగయ్య, చంద్రయ్య, యాదయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.